క్లుప్తంగా

ముట్టడిని జయప్రదం చేయాలి



వెంకటాపురం(ఎం): రేపు జిల్లాలోని తహసీల్ కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ చాతాళ్ల రమేష్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. పింఛన్ లబ్ధిదారులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ 15న తహసీల్ కార్యాలయాల ముట్టడి, 20న గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద మహాదీక్షలు చేపడుతామని తెలిపారు. ఆయన వెంట వెంకటాపురం మండల ఇన్‌చార్జ్ కాడపాక శ్యామ్ ఉన్నారు.

దోమల మందు పిచికారీ



కన్నాయిగూడెం: మండలంలోని చిట్యాల, ముప్పనపల్లి గ్రామాల్లో స్థానిక వైద్యుడు అభినవ్ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేయించారు. హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ ఇంటింటికీ దోమల మందును స్ప్రే చేయించారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆశాలు తదితరులు పాల్గొన్నారు

యూరియా కొరత లేకుండా చూస్తాం

ఏటూరునాగారం: మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లాలో యూరియా కొరత లేకుండా చూస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాల వల్ల యూరియా కొరత వస్తుందని పేర్కొన్నారు. ములుగు జిల్లాకు 1,200 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. ప్రతి రైతుకు యూరియా అందేవిధంగా చూస్తామని తెలిపారు.

గ్రామాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు



ఎస్ఎస్‌తాడ్వాయి: సద్దుల బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని తాడ్వాయి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ కార్యదర్శి రేగ రాజశేఖర్ సిబ్బందితో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. మండల కేంద్రంలోని తాడ్వాయి, నర్సింగాపూర్, కొండపర్తి గ్రామాల్లో వీధి రోడ్ల స్తంభాలకు విద్యుత్ దీపాలను అమర్చారు. విధులన్నీ రాత్రి సమయంలో విద్యుత్ కాంతులతో కళకళలాడనున్నాయి.

స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ

చిట్యాల: మండలంలోని చల్లగరిగలో నిర్వహిస్తున్న సీసీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ -02లో ఆడుతున్న పవర్ స్టార్ టీమ్‌కు జెర్సీ, లోయర్స్‌ను స్థానిక వాణివి ద్యానికేతన్ కర్పస్పాండెంట్ బండి సంపత్ కుమార్ శనివారం అందజేశారు. ఆటల్లో క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఇందిర, క్రీడాకారులు నోముల వేణు, నాగరాజు, రాజు, దేవేందర్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

బతుకమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో బతుకమ్మ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల రాకేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతీ ఏటా బతుకమ్మ పండగను రోడ్డుపై నిర్వహించడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కావున అధికారులు స్పందించి బతుకమ్మ ఆడుకోవడానికి స్థలాన్ని సేకరించి, విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కాకతీయ ముదిరాజ్ పరస్పర సహాయ సహకార పొదుపు పరపతి సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నట్లు ఆ కమిటీ గౌరవ సలహాదారులు కిసరి యాదగిరి, కంచెం నరసింహమూర్తి ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా కొలిపాక మల్లయ్య, ఉపాధ్యక్షులుగా నరెడ్ల ఐలయ్య, వేముల రాజమౌళి ప్రధాన కార్యదర్శి చొప్పరి రాజయ్య, కోశాధికారి కారుపాకల చందు, సహాయక కార్యదర్శిగా తీగల సంతోష్, గౌరవ సలహాదారులు నరసింహా, రాజకుమార్, దాసరి వెంకటేష్, నాగభూషణం ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

చెత్త రీసైక్లింగ్ ఊసేది..?



పిచ్చిచెట్లతో నిండిపోయిన గాంధీనగర్ సెగ్రిగేషన్ షెడ్డు



నిరుపయోగంగా ఉన్న పాపయ్యపల్లి సెగ్రిగేషన్ షెడ్డు

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- ప్రతి జీపీలో రూ.2.5 లక్షలతో నిర్మాణం
- నిధుల కొరత పేరుతో చెత్త సేకరణకు మంగళం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

గోవిందరావుపేట: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ, క్షేత్రస్థాయిలో నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఈ సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రజలలో అవగాహన లోపం, జీపీ సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో ఈ షెడ్లు ఉత్సవవిగ్రహాలుగా మారాయి. చెత్తను శాస్త్రీయంగా వర్గీకరించి రీసైక్లింగ్ చేయాలని ఉద్దేశం ఉన్నా, చాలా చోట్ల ఈ షెడ్ల వరకు చెత్త చేరడం లేదు. నిర్మాణాలు చేసి వదిలేశారు. నిధులు, సిబ్బంది కొరత కారణాలతో వాటిని పట్టించుకోవడం మానేశారు.



జాతీయ రహదారి పక్కనే పారబోసిన చెత్త

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

గ్రామాలు శుభ్రంగా– ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన చెత్త నిర్వహణ కార్యక్రమం పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్డుల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.2.5 లక్షల నిధులను కేటాయించింది. దీని ద్వారా షెడ్ నిర్మించి గ్రామాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించింది. ఇక్కడ తయారు చేసిన కంపోస్టు ఎరువును గ్రామంలోని రైతులకు విక్రయించాలని కార్యదర్శులను ఆదేశించింది. కానీ, ప్రస్తుతం సగానికి పైగా జీపీల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎరువు తయారీ చేయడంలేదు. దీంతో ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం నీరుగారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపోస్ట్ ఎరువు తయారీ లేకపోవడంతో షెడ్ల చుట్టూ పెరిగిన చెట్ల పొదలతో, వాటి పక్కనే ఇష్టానుసారంగా పోసిన చెత్తతో అవి భయంకరంగా దర్శనమిస్తున్నాయి.

షెడ్లు వినియోగించడం లేదు



చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి రాత్రిళ్లు ఇబ్బంది అవుతుంది. వారంలో కేవలం ఒకటి రెండు రోజులు మాత్రమే చెత్తను సేకరిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు. సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించి వదిలేశారు. అటు రైతులకు, ఇటు గ్రామ ప్రజలకు పనికిరాకుండా ఉన్నాయి.

\- తీగల ఆగిరెడ్డి, పస్రా

వినియోగంలోకి తెస్తాం



ప్రతి గ్రామంలో చెత్త సేకరణ, సెగ్రిగేషన్ షెడ్ల వినియోగం కోసం చర్యలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. త్వరలోనే షెడ్లు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం.

\- మమత, ఎంపీడీఓ

ఏజెన్సీ గ్రామాల్లో రోడ్లు నిర్మించాలి



మట్టిరోడ్డును చూపుతున్న కృష్ణయ్య

ములుగు రూరల్: ములుగు మండలంలోని ఏజెన్సీ గ్రామాలు జగ్గన్నగూడెం నుంచి ఓటాయి రాంపూర్ వరకు, పంచోత్కులపల్లి నుంచి కన్నాయిగూడెం వరకు నూతన రోడ్లను నిర్మించాలని సీపీఐ ఏజెన్సీ జోన్ కార్యదర్శి మంకిడి కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు శనివారం ఏజెన్సీ గ్రామాల్లో మట్టి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల నుంచి ఇతర మండలాలకు వెళ్లేందుకు మట్టి రోడ్లు ఉన్నాయని వాటి స్థానంలో నూతన రోడ్లు నిర్మించడంతో ఏజెన్సీ ప్రజలకు రవాణా భారం తగ్గుతుందని అన్నారు. కన్నాయిగూడెం నుంచి లక్నవరం కట్ట వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తూరు, యాపల గడ్డ నుంచి పొట్లాపూర్‌కు సుమారు 5 కిలో మీటర్ల దూరం రోడ్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ములుగు మండలం ఏజెన్సీ గ్రామాల నుంచి రోడ్లు ఏర్పాటు చేయడంతో కొత్తగూడెం, నల్లబెల్లి మండలాలకు రవాణా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి చొరవ చూపి ఏజెన్సీ రోడ్ల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దబ్బకట్ల నర్సయ్య, కల్లి తిరుపతి, సంపత్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నూతన అధ్యక్షురాలితో పావని, తదితరులు

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గుంటోజు పావని అన్నారు. మండలంలోని బంజరుపల్లిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచితప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, వ్యాపారాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించుకునే విధంగా కృషిచేయాలని తెలిపారు. అనంతరం బంజరుపల్లి మహిళా కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ మహిళా అధ్యక్షురాలిగా కొండె రమ, ఉపాధ్యక్షురాలిగా అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శిగా గంగుల అంజలి, కోశాధికారిగా పిట్టల లత, అధికార ప్రతినిధిగా భీమగాని శ్రీలత, కార్యదర్శిగా దాసరి కుమారి, సహాయ కార్యదర్శిగా సరోజనతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షురాలు కొండె రమ ను కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ములుగు పట్టణ అధ్యక్షురాలు నిట్టల రాధిక, కార్యదర్శి అల్లూరి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఏఈ రవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నేడు ములుగు ఫీడర్–2, 11 కేవీ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినాయక రైస్‌మిల్లు, పాల్‌సాబ్‌పల్లి, గడిగడ్డ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు: మున్సిపల్ కార్మికుడు మైదం మహేష్ కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి క్వింటా బియ్యాన్ని అందించి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, నాయకులు మట్టెవాడ తిరుపతి, మాదారపు రాజు, నద్దూనూరి రమేష్, రాజ్‌కుమార్, ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యుడు రవి పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న రమేష్‌రెడ్డి

పొట్లాపూర్‌లో..

ములుగు రూరల్: మండలంలోని పొట్లాపూర్ గ్రామానికి చెందిన గాదం రాధిక అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్‌రెడ్డి శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూతనందించారు. పోరిక విజయరాంనాయక్, కవ్వంపల్లి బాబు, నాజర్‌ఖాన్, రాజశేఖర్, చంటి తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలల వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- కొప్పుల రవి

ఎస్ఎస్‌తాడ్వాయి: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న డైలీవేజ్, కాంటినిజెంట్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆదివాసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కొప్పుల రవి డిమాండ్ చేశారు. మండలంలోని మేడారం ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్న కాంటినిజెంట్ వర్కర్లకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డైలీవేజ్, కాంటినిజెంట్ వర్కర్లకు పర్మినెంట్ టైం స్కేల్ చేయాలని కోరారు. కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలన్నారు. మృతి చెందిన వర్కర్ల కుటుంబ సభ్యులకు పని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్కర్లు సమ్మె చేయడంతో పాఠశాలల్లో వివిధ పనులు నిలిచిపోయాయి. కాగా మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట కూడా సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో కాంటినిజెంట్ వర్కర్లు ఇందిర, వెంకటరమణ, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్‌తాడ్వాయి: సమ్మె చేస్తున్న కాంటినిజెంట్ వర్కర్లు

మంగపేట: కోమటిపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలుర శ్రమ ఉన్నత పాఠశాల ఎదుట గిరిజన ఆశ్రమ పాఠశాల్లో డైలివేజ్ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలల్లో విధులు బహిష్కరించిన డైలివేజ్ వర్కర్లు, కాంటిన్‌జెన్సీ వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు.



మంగపేట: కోమటిపల్లి ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఎదుట

సీజనల్ భయం



ఎల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



తాడిచర్ల పీహెచ్‌సీలో క్యూలో ఉన్న జనం

- వాతావరణ మార్పులతో వ్యాపిస్తున్న జ్వరాలు
- ఆస్పత్రికి క్యూ కడుతున్న జనం
- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ

మల్హర్: వాతావరణ పరిస్థితులు ప్రస్తుతం రోజుకో విధంగా మారుతున్నాయి. ఉదయం వర్షం కురిస్తే మధ్యాహ్నం ఎండ దంచికొడుతుంది.. సాయంత్రం సాధారణంగా ఉంటే అర్ధరాత్రి చలిగా ఉంటుంది. ఇలా వాతావరణ మార్పులతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఒంట్లో నలతగా ఉండటం, జ్వరాలతో ఇబ్బందులు పడటం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతి పది మందిలో నలుగురికి జలుబు, ఇద్దరికి జ్వరంతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. దీంతో తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నిసత్తువగా ఉంటుంది. కొందరిలో ఒంటిపై దుద్దుర్లు, వాంతులు, అరుదుగా విరేచనాలూ కనిపిస్తాయి. మరికొందరిలో జలుబు వంటి లక్షణాలేవీ లేకుండానే జ్వరాలు వస్తాయి. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, వంటి వైరల్ ఫీవర్ కిందకే వస్తాయంటున్నారు.. వైద్యులు.

వైరల్ ఫీవర్‌కు కారణాలు..

వైరల్ ఫీవర్ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా కూడా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు వైరల్ ఫీవర్స్ వస్తుంది. ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. ఇంటి ఆవరణలో పూల తొట్లలో నిలిచిన నీటిని తొలగించడంతోపాటు పాత టైర్లు, పాత డబ్బాల్లో నిలిచిన నీటిని తొలగించాలి. ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలి.

అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. దోమ తెరలను వినియోగించాలి. పూల కుండీలు, ఎయిర్ కూలర్లు, నీటి గొట్టాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగితే మంచిది.

\- వినయ్ భాస్కర్, వైద్యాధికారి, మల్హర్

పెరుగుతున్న ఓపీ కేసులు

సీజనల్ వ్యాధులతో మండల కేంద్రం తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ఓపీ కేసుల సంఖ్య పెరుగుతున్నాయి. వారం రోజులుగా జ్వరం, జలుబు, దగ్గు ఒళ్లు నొప్పులతో ఆస్పతికి జనం క్యూ కడుతున్నారు. తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల తదిత గ్రామాల నుంచి ప్రతి రోజూ 100 నుంచి 150 మందికిపైగా రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి రక్త, మూత్ర పరీక్షలు చేసి రిపోర్టుల ఆధారంగా వైద్య సిబ్బంది మందులను అందిస్తున్నారు. ఎడ్లపల్లి గ్రామంలో గత గురువారం విష జ్వరంతో ఓ వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన వైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ ఆవరణ మెడికల్ క్యాంపు నిర్వహించి, 50 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

బాల్యవివాహాలతో అనేక ఇబ్బందులు

- కోఆర్డినేటర్ తిరుపతి



వేంకటేశ్వర ఆలయంలో అవగాహన కల్పిస్తున్న ఎన్జీఓ ప్రతినిధులు

భూపాలపల్లి రూరల్: బాల్యవివాహాలతో బాలల భవిష్యత్ ఆగం అవుతుందని మానసిక, సామాజిక, శారీరక ఇబ్బందులు ఎదురవుతాయని జస్టిరైట్స్ ఫర్ చిల్డ్రన్ సహాయ ఎన్జీఓ డిస్ట్రిక్ కో– ఆర్డినేటర్ తిరుపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా శనివారం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. సెప్టెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు ప్రపంచవ్యాప్తంగా 39 దేశాల్లోని వివిధ మత పెద్దలతో బాల్యవివాహాల నిర్మూలన కోసం జస్టి రైట్స్ ఫర్ చిల్డ్రన్ అవగాహన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన హిందూ దేవాలయాల్లోని పురోహితులు, అర్చకులు, భక్తులను కలిసి బాల్యవివాహాల చట్టంపై వివరించినట్లు తెలిపారు. చట్ట ప్రకారం 18 సంవత్సరాల లోపు అమ్మాయిలకి 21 సంవత్సరాలలోపు అబ్బాయిలకి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించనున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు జరపబోమని పూజారులు, అర్చకులతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శివాలయ అర్చకులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

'మతమార్పిడి'పై చర్య తీసుకోవాలి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏబీవీపీ, భజరంగ్‌దళ్ నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో మతమార్పిడికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ, భజరంగ్‌దళ్ నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఎల్‌బీ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సునిల్ ఇంట్లో మతమార్పిడి కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఆ కార్యకలాపాలకు గంగారం మోడల్ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థినులను రాత్రి సమయంలో తీసుకొచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేవలం విద్యార్థుల వ్యక్తిగత హక్కుల మీద దాడి చేయడమే కాకుండా, చిన్నారులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి భవిష్యత్ దిశను మార్చే ప్రమాదకర చర్య అన్నారు. జిల్లా కేంద్రంలో పోస్ట్‌మెట్రిక్ ఎస్సీ, బీసీ బాలికల హాస్టల్ విద్యార్థులను తల్లిదండ్రులు, ప్రభుత్వ అనుమతి లేకుండా బయటకు పంపిన వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గుజ్జుల ప్రేమకుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీసీలు రాజ్యాధికారాన్ని అందిపుచ్చుకోవాలి

- వంగ రవి యాదవ్

భూపాలపల్లి రూరల్: బీసీలు రాజ్యాధికారం వైపు పయనించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కమిటీ మెంబర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ సమితి జిల్లా నాయకుడు గట్ల రాజన్న అధ్యక్షతన కోటి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వంగ రవి యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. దేశంలో బీసీలు అత్యధిక జనాభా కలిగి ఉన్నారని అన్నారు. 42 శాతానికి రిజర్వేషన్ అమలుపరచాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి బీసీ రాజ్యాధికార సమితి అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఏరుకొండ హైమావతి, జిల్లా నాయకులు బుచ్చన్న, సదానందం, వేణుగోపాల్ యాదవ్, రజితయాదవ్, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు పత్రాలతో బీసీ నాయకులు

దానం ఇచ్చిన భూమిని కాపాడండి

చిట్యాల: దానం ఇచ్చిన భూమిని కాపాడాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన రాంనగర్ ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్యే సత్యనారాయణరావుకు శనివారం క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. గతంలో గ్రామానికి చెందిన బీరవోలు పాపిరెడ్డికి చెందిన భూములను విక్రయిస్తున్న క్రమంలో కాలనీకి చెందిన పెద్ద మనుషులు కీ.శే.ఆరెపల్లి ఆగయ్య, కట్కూరి నర్సయ్య, ఆరెపెల్లి అంకూస్.. తమ కాలనీకి దానంగా 10 గుంటల భూమిని ఇవ్వాలని వేడుకున్నారు. దీంతో పాపిరెడ్డి సర్వే నంబర్ 809/1లో ఆరు గుంటల భూమిని కేటాయిస్తూ అప్పటి సర్పంచ్ కోక్కుల సదానందం ఆధ్వర్యంలో 1997 సంవత్సరంలో పత్రాన్ని రాసి ఇచ్చారు. నాటినుంచి ఖాళీగా ఉన్న స్థలంపై గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు విక్రయించేందుకు ప్రయత్నించి గుంటకు రూ.లక్ష చొప్పున ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. దీంతో గ్రామస్తులంతా ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేయగా ఆయన తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. విచారణ జరిపి హద్దులను ఏర్పాటు చేయాలని చెప్పారు.